క్లుప్తంగా

నేడు జల్‌పల్లిలో మంత్రుల పర్యటన

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డిలు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వారు శ్రీరాం కాలనీలో 12 కుల సంఘాల కమ్యూనిటీ హాళ్లకు శంకుస్థాపన చేయనున్నట్లు కమిషనర్ వసంత తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు శంకుస్థాపన అనంతరం కుల సంఘాల ఆత్మీయ సమ్మేళన సభ ఉంటుందని వసంత వెల్లడించారు. ఈ సభను జయప్రదం చేసే విషయమై మంత్రి సబితా ఇంద్రారెడ్డి తనయుడు కార్తీక్ రెడ్డి శనివారం జల్‌పల్లి గ్రామంలో ముఖ్య నేతలతో సమావేశమయ్యారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి


చేప పిల్లలను పంపిణీ చేస్తున్న జ్యోతి, జంగారెడ్డి

కందుకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మంద జ్యోతిపాండు, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి పిలుపునిచ్చారు. బేగంపేట, చిప్పలపల్లి, కందుకూరు, నేదునూరు, పులిమామిడి, కొత్తగూడ గ్రామాల్లోని చెరువుల్లో వదలడానికి సుమారు 6లక్షల చేప పిల్లలను శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జి లక్ష్మీనర్సింహారెడ్డి, మేఘనాథ్ రెడ్డి, మంద పాండు తదితరులు పాల్గొన్నారు.

బాచుపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడిగా కృష్ణ



కందుకూరు: మండల పరిధిలోని బాచుపల్లి కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా సీహెచ్ కృష్ణ నియమితులయ్యారు. శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

సభకు తరలిరండి

కందుకూరు: బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం బూత్‌పూర్‌లో చేపట్టనున్న పాలమూరు ప్రజా గర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల ప్రధానకార్యదర్శి నిమ్మ అంజిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఉ.10 గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

నేడు మెడికల్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన

కందుకూరు: మండలంలోని మీర్‌ఖాన్‌పేట రెవెన్యూ సర్వే నంబర్ 112లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న మెడికల్ కళాశాల భవన నిర్మాణానికి ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు, విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొననున్నట్లు అధికారులు వెల్లడించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తుర్కయంజాల్: స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములై పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీ.హెచ్. శ్రీకాంత్, తుర్కయంజాల్ కౌన్సిలర్ మంగమ్మ కోరారు. శనివారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా తుర్కయంజాల్‌లోని శ్రీరామ్‌నగర్ కాలనీలో ఇళ్ల మధ్యలో పేరుకుపోయిన వ్యర్థాలను సిబ్బందితో కలిసి తొలగించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడే వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న ధరణి కుమార్

తుర్కయంజాల్: కుష్టు వ్యాధి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ ధరణి కుమార్ తెలిపారు. కుష్టు వ్యాధి నిర్మూలన, వ్యాధి గ్రస్తుల గుర్తింపుపై శనివారం తుర్కయంజాల్, రాగన్నగూడలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధరణి కుమార్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి గ్రస్తుల పట్ల వివక్ష చూపకూడదని, వ్యాధి సోకినా, లక్షణాలతో బాధపడుతున్న వారి వివరాలను వైద్య సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. సకాలంలో వైద్యం తీసుకుంటే వ్యాధి నుంచి బయటపడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు కౌన్సిలర్ అనురాధ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు

- ఇళ్ల మధ్య పారుతున్న మురుగు
- రోగాల బారిన జనం
- పట్టించుకోని అధికారులు



తుక్కుగూడలో ఇళ్ల మధ్య చేరిన మురుగు

తుక్కుగూడ: ఇది జిల్లాలో అభివృద్ధి చెందుతున్న శివారు ప్రాంతంగా పేరుపొందింది. తుక్కుగూడ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సమస్య ఉత్పన్నమవుతోంది. మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాల్లో పందులు, కుక్కలు, స్వైర విహారం చేస్తున్నాయి. ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. పారిశుద్ధ్యం లోపిస్తుంది. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఇంటింటా మంచి నీరు అందించే ఉద్దేశ్యంతో సీసీ రోడ్లను చాలా వీధుల్లో ధ్వంసం చేశారు. వాటికి మరమ్మతులు చేయకపోవడంతో రోడ్లు పూర్తిగా గుంతలుగా మారుతున్నాయి. అందులో మురుగు నీరు చేరి దోమలు, ఈగలకు నిలయంగా మారుతున్నాయి. దీంతో సీజనల్ వ్యాధులు పెరుగుతున్నాయి. జనం వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న బాధితుల సంఖ్య..

మున్సిపాలిటీ పరిధిలో సీజనల్ వ్యాధులకు గురయ్యే బాధితుల సంఖ్య నానాటికి పెరుగుతుంది. ప్రతి ఇంట్లో దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులతో బాధపడేవారి సంఖ్య ఎక్కువవుతుంది. ఇంట్లో ఒక్కరికి వస్తే ఇంకొకరికి ప్రబలుతుంది. ఇలా చిన్న, పెద్ద తేడా లేకుండా విష జర్వాలు వస్తున్నాయి. ఈ క్రమంలో ప్రజలు స్థానికంగా ప్రైవేటు ఆసుపత్రిలు, ఆర్ఎంపీలను సంప్రదించి ఎక్కువ మొత్తంలో ఖర్చుచేసుకుంటున్నారని రోగులు వాపోతున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని జనం కోరుతున్నారు. ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

> **వాతావరణంలో మార్పులే కారణం..**
>
> వాతావరణంలో మార్పుల మూలంగా ప్రజలు సీజనల్ వ్యాధులకు గురవుతున్నారు. ఈ విషయంలో ప్రజలు అప్రమతంగా ఉండాలి. సంపూర్ణ పారిశుద్ధ్య చర్యలు పాటించాలి. మురుగు నీరు నిల్వకుండా జాగ్రత్త తీసుకోవాలి. జ్వరం వచ్చిన వెంటనే వైద్యం చేయించుకోవాలి. తుక్కుగూడలో ఇప్పటి వరకు ఒక డెంగ్యూ కేసు నమోదైంది.
>
> – డాక్టర్ రాజ్‌కుమార్

గణపతి ఉత్సవాలు ఐక్యతకు నిదర్శనం

- కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి
- వేలంలో లడ్డూను దక్కించుకున్న పండరీనాథ్‌గౌడ్


హుడాకాంప్లెక్స్: లడ్డూను వేలంలో దక్కించుకున్న పండరీనాథ్‌గౌడ్

హుడాకాంప్లెక్స్: గణపతి ఉత్సవాలు ఐక్యతకు నిదర్శనమని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అన్నారు. సరూర్‌నగర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపయ్యకు, 9 రోజుల పూజల అనంతరం శుక్రవారం రాత్రి భారీ ఊరేగింపుతో నిమజ్జనానికి తరలారు. మండపం వద్ద నిర్వహించిన లడ్డూ వేలంలో సరూర్‌నగర్‌కు చెందిన కందికంటి పండరీనాథ్‌గౌడ్ రూ. 2,01,000లకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి మాట్లాడుతూ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించిన అధికారులు, యువతకు, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ యూత్ క్లబ్ కమిటీ సభ్యులు సంపత్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, రాజు, నిఖిల్, ఆదర్శ్, అఖిల్ పాల్గొన్నారు.

లడ్డూ రూ. 75వేలు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్‌లో గణపతి నిమజ్జనం కొనసాగుతున్నాయి. 28వ డివిజన్‌లోని శ్రీకృష్ణ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని లడూను వేలం వేయగా సమ్మిరెడ్డి రవికాంత్‌రెడ్డి రూ.75,300లకు కైవసం చేసుకున్నారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘం నిర్వాహకులు రవికాంత్‌రెడ్డి, మీనా, రిశాంత్‌రెడ్డి, విక్రాంత్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సుబ్రమణ్యస్వామి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, రాఘవేందర్‌రావు, కార్యదర్శి గాంధీలాల్, కోశాధికారి శేఖర్, సతీశ్,రాజేశ్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా సత్తిరెడ్డి



కందుకూరు: బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా కందుకూరుకు చెందిన దేశం సత్తిరెడ్డిని నియమించారు. శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నియోజకవర్గం కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సత్తిరెడ్డి మాట్లాడుతూ.. పదవీ బాధ్యతలు అప్పగించిన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్, ఎంపీపీ జ్యోతిపాండు, ఎంపీటీసీ ఎస్.ఎల్లారెడ్డి, నాయకులు అమరేందర్‌రెడ్డి, కొంతం జంగారెడ్డి, ఎగ్గిడి సత్తయ్య, నిమ్మ అంజిరెడ్డి, రమేష్‌గౌడ్, ప్రభాకర్, కృష్ణకుమార్, రాములు పాల్గొన్నారు.

రుణ మాఫీ చేయాలని కాంగ్రెస్ ధర్నా


ధర్నాలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

కందుకూరు: రుణ మాఫీ చేయాలంటూ నేదునూరు కెనరా బ్యాంక్ ఎదుట వైస్ ఎంపీపీ జి.శమంతప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా మైనార్టీ ప్రధానకార్యదర్శి ఎండీ అఫ్జల్‌బేగ్ రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. వారికి డీసీసీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, పీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్ మద్దతు పలికారు. 2018లో రుణాలు తీసుకున్న 1,800 మందికి పైగా రైతులకు రుణ మాఫీ కాలేదన్నారు. అన్ని అర్హతలు ఉన్నా వారికి రుణమాఫీ కాకపోవడం బాధాకరమన్నారు. తాము అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు, వరి పంటకు రూ.500 బోనస్ అందిస్తామన్నారు. రూ. 2లక్షల రుణమాఫీ ఒకేసారి చేపడతామన్నారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్‌కు వారు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి బొక్క భూపాల్‌రెడ్డి, ఎన్ఎస్ఐయూ జిల్లా ప్రధానకార్యదర్శి వినోద్‌చారి, వి.నారాయణ, బి.పాండురంగారెడ్డి, ఓర్సు వెంకటేశ్, చేగూరి మల్లేశ్, యాదగిరి, సి కృష్ణా, కె.జంగారెడ్డి, గంగుల చంద్రారెడ్డి, రఘురామ్‌రెడ్డి, దర్శన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకుల అరెస్టు హేయం


ధర్నా చేస్తున్న ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులు

కందుకూరు: మహేశ్వరంలో పర్యటిస్తున్న మంత్రులకు సమస్యలపై వినతిపత్రం అందజేయడానికి వెళ్లిన సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలపై దాడి చేసి అరెస్టు చేయడం హేయమైన చర్యని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి.రాంచందర్, మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ ఆరోపించారు. అరెస్టు అయిన సీఐటీయూ నాయకులు బాల్‌రాజు, శేఖర్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక పీఎస్ ఎదుట ఆశ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు సరస్వతి, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు ప్రభావతి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆశవర్కర్లు మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించకుండా పోరాడుతున్న వారిపై దౌర్జన్యం చేయడం బాధాకరమన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం చేస్తూనే ఉంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి బీజేపీ

మీర్‌పేటలో మేరా మిట్టీ, మేరా దేశ్


మట్టిని స్వీకరిస్తున్న మనోహర్‌రెడ్డి

మీర్‌పేట: ఇంటింటికి బీజేపీ నాయకులు వెళ్లి ప్రధాని నరేంద్రమోదీ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు మీర్‌పేట కార్పొరేషన్‌లో శనివారం కార్పొరేటర్ పెండ్యాల నర్సింహ 'మేరా దేశ్ మేరా మిట్టి' నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి ఇంటింటికి తిరిగి మట్టిని స్వీకరించారు. దేశ రక్షణకు అమరులైన సైనికుల జ్ఞాపకార్థం ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం స్థూపం ఏర్పాటు చేస్తోందని, అందులో భాగంగానే మేరాదేశ్ మేరా మిట్టి నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో కీసర గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు పెండ్యాల శివపార్వతి, భిక్షపతిచారి, యాదగిరి యాదవ్, సూల ప్రభాకర్, గాజుల మధు, మద్ది రాజశేఖర్‌రెడ్డి, బెల్లంకొండ నాగరాజు, నగేష్‌కుమార్, విక్కీసాగర్ పాల్గొన్నారు.

వైశ్య గర్జనను జయప్రదం చేయండి


సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రేమ్‌గాంధీ

హుడాకాంప్లెక్స్: వైశ్య కమిషన్‌తో పాటు ఈడబ్ల్యూఎస్ ఏబీసీడీ అమలు చేయాలని వైశ్య వికాస వేదిక నాయకులు డిమాండ్ చేశారు. వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ లయన్ కాచం సత్యనారాయణ గుప్తా ఆధ్వర్యంలో ఆదివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించే 'వైశ్య గర్జన'కు అధిక సంఖ్యలో వైశ్యులు పాల్గొని విజయవంతం చేయాలని ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు ప్రేమ్‌గాంధీ కోరారు. శనివారం స్టేడియంలో సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. తెలంగాణ ఉద్యమంలో ఆర్యవైశ్యుల పాత్ర కీలకమైందని, ఆర్థిక భరోసా ఇచ్చిన ఉద్యమకారులకు న్యాయం జరగలేదని ఈ సందర్భంగా ప్రేమ్‌గాంధీ పేర్కొన్నారు. వైశ్య సంఘాలన్నీ ఒక్కటిగా నిర్వహించే గర్జనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

పౌల్ట్రీ ఫాంపై చర్యలు తీసుకోవాలని వినతి


గ్రామస్తులతో సమావేశమైన సర్పంచ్ మల్లారెడ్డి

కందుకూరు: పౌల్ట్రీ ఫాంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సర్పంచ్ సాధ మల్లారెడ్డి తహశీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. మండల పరిధిలోని కొత్తగూడ సమీపంలోని శ్రీకాంత్‌రెడ్డికి చెందిన పౌల్ట్రీ ఫారమ్‌తో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే విషయంపై పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పౌల్ట్రీ ఫాం నుంచి తీవ్ర దుర్వాసనతోపాటు ఈగలు, దోమలు విజృంభిస్తున్నాయన్నారు. ఇటీవలనే పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేశారని వినతిప్రతంలో వారు పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కరించాలని పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. గ్రామస్తుల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని సమస్య పరిష్కరించాలని సర్పంచ్ అధికారులను కోరారన్నారు. కార్యక్రమంలో పాలక వర్గం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సహకార సంఘం బలోపేతమే లక్ష్యం

మేయర్ చిగురింత పారిజాత


మాట్లాడుతున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: బాలాపూర్ సహకార సంఘం బలోపేతమే లక్ష్యమని బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత స్పష్టం చేశారు. శనివారం బండ్లగూడ ఖల్సా (బాలాపూర్) ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం 47వ వార్షిక మహాజనసభను బాలాపూర్‌లో సొసైటీ చైర్మన్ సింగిరెడ్డి పెంటారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. బ్యాంక్ సీఈవో ఎర్ర జైహింద్ వార్షిక నివేదికను చదివి వినిపించారు. అనంతరం మేయర్ పారిజాత మాట్లాడుతూ రైతుల కోసం ఏర్పాటు చేసుకున్న సొసైటీని బలోపేతం చేయాలన్నారు. సొసైటీ చైర్మన్ పెంటారెడ్డి మాట్లాడుతూ సంఘం ఆర్థికంగా ఎదిగేందుకు ఎన్నో ఆటుపోట్లు తట్టుకుని నేడు జిల్లాలో సహకార సంఘాలలో మొదటి స్థానంలో నిలిపినట్లు తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వారికి స్వల్పకాలిక, దీర్ఘకాలిక, మధ్యకాలిక రుణాలతో పాటు బంగారు ఆభరణాలపై రుణాలు అందచేస్తున్నామన్నారు. అంతేకాక లాకర్ సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. మహిళా సంఘాలకు రుణాలు ఇస్తున్నామన్నారు. పిల్లల భవిష్యత్‌కోసం బాలగణేశ్ రికరింగ్ డిపాజిట్లు, త్రిపుల్ ఎస్ ఖాతాలు ఓపెన్ చేశామన్నారు. దీన్ని రైతులు, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గసభ్యులు ఉపాధ్యక్షులు కొలన్ తిరుపతిరెడ్డి, నీరుడి నర్సింహ, కళ్లెం ఎల్లారెడ్డి, రావుల లింగం, ఇబ్రాం బాలయ్య, పన్నాల గోపాల్‌రెడ్డి, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, ఎర్ర జైహింద్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి రూ. 20 లక్షలు


గ్రామస్తులకు ఉత్తర్వులు అందజేస్తున్న ఎమ్మెల్యే

యాచారం: మండలంలోని చింతుల్ల గ్రామాభివృద్ధికి రూ. 20 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. గ్రామంలోని పలు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చింతుల్ల సర్పంచ్ సబిత, మాజీ సర్పంచ్ సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని అత్యధిక మోజార్టీతో గెలిపిద్దాం

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్

యాచారం: 'మండలంలోని ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిద్దాం, నాలుగోసారి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించుకుందాం' అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. యాచారం మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి పనులను వివరించాలన్నారు.

రేపు యాచారానికి ఎమ్మెల్యే

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సోమవారం యాచారం మండల పర్యటనకు వస్తున్నట్లు రమేశ్‌గౌడ్ తెలిపారు. యాచారం, మంతన్‌గౌరెల్లి, కేసీతండా, తక్కళ్లపల్లి తదితర గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని ఆయన తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శి భాషా, పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, యాదయ్యగౌడ్, సత్యపాల్ పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ ఇవ్వాలి

ఇబ్రహీంపట్నం: ఎస్సీ, ఎస్టీ, ఉప కులాలకు ఉచిత విద్యుత్ 301 యూనిట్ల వరకు ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సామేల్ డిమాండ్ చేశారు. శనివారం విద్యుత్ ఏడీ కార్యాలయం ఎదుట ఉచిత విద్యుత్ వ్వాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 342ను జీవోను సవరించి నెలకు 101 నుంచి 301 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు వీరేశం, ఆనంద్, గణేశ్, యాదగిరి పాల్గొన్నారు.

సొసైటీ బలోపేతానికి సహకరించాలి


చెక్కులు అందిస్తున్న పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లు

కందుకూరు: సొసైటీ బలోపేతానికి రైతులు సహకరించాలని పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, వైస్ చైర్మన్ జి.విజేందర్‌రెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం ఆవరణంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అర్ధ సంవత్సరానికి సంబంధించి సొసైటీ పరిధిలో జరిగిన లావాదేవీల వివరాలను సభ్యులకు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆరు నెలల కాలంలో 108 మంది కొత్త సభ్యులకు రూ.5.30 కోట్లు దీర్ఘకాలిక రుణాలు అందించామన్నారు. మరో రూ.5 కోట్ల రుణాల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. 1,302 మందికి రుణ మాఫీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జి.శమంత ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, సర్పంచులు శమంతకమణి, మహేశ్, రైతు బంధు అధ్యక్షుడు కృష్ణరాంభూపాల్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు ఎస్.శేఖర్‌రెడ్డి, నర్ల నరసింహ, జి.అంజమ్మ, కె.యశోద, ఎస్.వెంకట్రామ్‌రెడ్డి, ఎస్.పాండురంగారెడ్డి, పి.ఆనంద్, ఎం.చంద్రు, కాకి దశరథ, సదానంద్‌గౌడ్, అచ్చన పాండు, దేవీలాల్, అచ్చన వెంకన్న, టి.సంజీవరెడ్డి, సురేందర్‌రెడ్డి, డి.కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, పి.అంజయ్య, రవీందర్‌రెడ్డి, ఎస్.కృష్ణారెడ్డి, సీఈఓ నిమ్మ అంజిరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలను పట్టించుకోని బీఆర్ఎస్ ప్రభుత్వం

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

- యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్ష


మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ ధ్వజమెత్తారు. మండల కేంద్రంలో 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్ ఆధ్వర్యంలో శనివారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మండల కేంద్రం ఏర్పాటై ఏడేళ్లు దాటినా ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయకుండా ప్రజాప్రతినిధులు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కారమయ్యే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, ఎస్సీసెల్ అధ్యక్షుడు అశోక్, నాయకులు ఇక్బాల్, మల్లేశ్‌గౌడ్, రాంచందర్‌నాయక్, తులసీరాం, రాజేందర్ తదితరులు ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తునట్లు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని బీఆర్ఎస్ మండల, మున్సిపాలిటీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. సీఎం కేసీఆర్ పాలనలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. పార్టీ గెలుపునకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.